
ప్రజాశక్తి
శనివారం 5 నవంబర్ 2022
5
విజయనగరం



స్కేటింగ్‌లో జాతీయస్థాయికి కౌశిక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతనెల 27 నుండి 31వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర 34వ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ఫోర్టుసిటీ పాఠశాల 5వ తరగతి విద్యార్థి నెక్కంటి శ్రీసాయి కౌశిక్ రెండు రజత పతకాలు, ఒక కాంస్యపతకం సాధించాడు. డిసెంబరు 11నుండి 22వరకు జాతీయస్థాయిలో బెంగుళూరులో స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎపి రాజు (శివ) మాట్లాడుతూ తమ విద్యార్థి నాలుగు సంవత్సరాలు వరుసగా జాతీయస్థాయికి ఎంపికవ్వడమే కాకుండా పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో బాటు వివిధ రంగాలలో తమ ప్రతిభను కనబర్చాలన్నారు. కౌసిక్‌ను పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ గిరిజారాణి, డైరెక్టర్లు మధు, అశోక్ నీలిమ అభినందించారు.



లచ్చయ్యపేట చక్కెర పరిశ్రమలో రెండేళ్లుగా చెరకు క్రషింగ్ చేయడం లేదు. గతేడాది కూడా సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తరలించడం రైతులకు తలకుమించిన భారంగా మారింది. దీంతో ఈ ఏడాది రైతులు చెరకు సాగు తగ్గించి గోగు పంటపై ఆసక్తి చూపించారు. ప్రస్తుతం ధర లేక పోవడంతో గోగు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి సమయంలో ధర నిర్ణయం, కొనుగోలులో కీలకంగా వ్యవహరించాల్సిన జెసిఐ పత్తాలేకుండా పోయింది.

ధర లేక.. గోగు రైతు గోడు

గోగునార తీస్తున్న మహిళలు

పత్తాలేని జెసిఐ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

నియోజకవర్గంలో ఈ ఏడాది 600 ఎకరాల్లో, మండలంలో 150 ఎకరాల్లో రైతులు గోగుసాగు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది గోగు సాగు విస్తీర్ణం పెరిగింది. కానీ ధర తగ్గిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది పుట్టి (ఒక బేలు) సుమారు మూడు క్వింటాళ్లు రూ.15 వేలు ఉండేది. ప్రస్తుతం కొనేందుకు ఏ వ్యాపారీ ముందుకు రాకపోగా వచ్చిన వారు రూ.9800కే అడుగుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతు దిగాలుగా ఉన్నాడు.

ఖర్చు ఎక్కువే

ఎకరా గోగు పంటకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి అవుతుంది. పంట తీసేందుకు రూ.3 వేలు వరకు, ఒక్కో బండి అద్దె రూ.400, గొప్పునకు రూ.5 వేలు వేలు, సేకు పులమడానికి రూ.5 వేలు, ఒక్కో కట్ట కట్టడానికి ఐదారు రూపాయలు, కట్టే కూలీకి రూ.400.. ఇలా మొత్తంగా రూ.25 వేలు వరకు పెట్టుబడి అవుతుంది. కానీ కొనుగోలు జరగడం లేదు. దీంతో రైతుకు కష్టమే మిగులుతుంది.

పత్తా లేని జెసిఐ

గతంలో బొబ్బిలి ప్రాంతంలోని జ్యూట్‌మిల్లులు పనిచేస్తుండడంతో రైతులు చెరకుతోపాటు గోగును ఎక్కువగా సాగుచేస్తూ ఉండేవారు ప్రస్తుతం జ్యూట్‌మిల్లులు మూతపడ్డాయి. దీంతోపాటు లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ గానుగ ఆడక పోవడంతో మళ్లీ రైతులు గోగు పంటను వేశారు. గోగు పంట వేసినప్పటికి దానిని కొనుగోలు చేసే జెసిఐ (జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) గత మూడేళ్లుగా కొనడం లేదు. అంతేకాదు, రైతులకు సలహాలు ఇచ్చేందుకు కనీసం కార్యాలయం తెరవడం లేదు. దీంతో గోగురైతులు ప్రయివేట్ వర్తకులనే ఆశ్రయిస్తున్నారు. వారు చెప్పిన రేటుకే రైతులు తమగోగు పంటను ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది.



మూతపడిన జెసిఐ కార్యాలయం

గానుగ లేకపోవడం వల్లే



గతంలో చెరకు సాగుచేశాను. లచ్చయ్యపేటలో చెరకు క్రషింగ్ ఆగిపోవడంతో గోగు వేశాను. దీనిని కొనేవారు లేకపోవడంతో నార తీసి కట్టలు కట్టి ఇంటి వద్దే భద్రపరిచాను. వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు.

- పాలేటి లక్ష్మణ, రైతు, కలవరాయి

గతేడాది రూ.15 వేలు ఉండేది



రెండు ఎకరాల్లో గోగు వేశాను. గతంలో పుట్టి రూ.15 వేలకు కొన్న వర్తకులు ఈ ఏడాది రూ.9800కే అడుగుతున్నారు. జెసిఐ ధర నిర్ణయించకపోవడం, కొనుగోలు చేయకపోవడం వల్ల ప్రయివేటు వ్యాపారులకే వారు నిర్ణయించిన ధరకే ఇవ్వాల్సి వస్తుంది.

- కోరాడ సత్యనారాయణ, రైతు, కలవరాయి





ప్రకాశం, కృష్ణా జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న బేబినాయన

హోరాహోరీ పోరులో
వాలీబాల్ విజేతలు ప్రకాశం, కృష్ణా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల మైదానంలో హోరా హోరీగా సాగిన రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రకాశం, కృష్ణా జిల్లాల జట్లు విజయం సాధించాయి. మూడు రోజులుపాటు జరిగిన ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 13 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా, బాలికల విభాగంలో కృష్ణా జిల్లా క్రీడాకారులు విజయం సాధించారు. సెమీ ఫైనల్‌కు బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లా జట్లు చేరుకోగా, బాలికల విభాగంలో కృష్ణా, గుంటూరు జిల్లా జట్లు చేరుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో కృష్ణా, రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో విశాఖపట్నం జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో ప్రకాశం, రెండో స్థానంలో పశ్చిమగోదావరి, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాలుగో స్థానంలో కృష్ణా జట్లు నిలిచాయి.

ఏకపక్షంగా కృష్ణా జట్టు విజయం

బాలికల విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా, గుంటూరు జిల్లాల మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. అయితే గుంటూరు జిల్లా జట్టుపై కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది.

బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. రెండు జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో మొదటి సెట్లో పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులు విజయం సాధించగా రెండు, మూడు, నాలుగు సెట్లలో వరుసగా మూడు సెట్లలో ప్రకాశం క్రీడాకారులు విజయం సాధించాయి. దీంతో ప్రకాశం జిల్లా జట్టును విన్నర్ గా ప్రకటించారు.

విజేతలకు, రన్నర్లకు, మూడో స్థానం, నాలుగో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన బహుమతులు అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకే బొబ్బిలిలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. విన్నర్లకు బేబినాయన అభిమాని రౌతు పార్థసారథి క్రీడా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, వాలీబాల్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జెఎన్‌టియు విద్యార్థులు

విజయనగరం : జెఎన్‌టియుజివి లో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా 200 మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ ఈ సందర్భగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని అనానరు. ప్రతి విద్యార్థి ఒక మొక్క దత్తత తీసుకొని వాటి సంరక్షణ బాధ్యత స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్. గురునాథ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. అప్పలనాయుడు, ఎస్‌బిఐ జెఎన్‌టియు. బ్రాంచి మేనేజర్ కె. సింహాచలం నాయుడు, 70 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్‌పి, ఎమ్మెల్సీ

మనసు దోచే చేనేత వస్త్ర ప్రదర్శన

- విరివిగా కొందాం.. నేతన్నకు చేయూతనిద్దాం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర నలు మూలల నుండి చేనేత కళాకారులతో మగ్గాలపై తయారు చేసిన చేనేత వస్త్రాలు మహిళల మనసును దోచేలా ఉన్నాయి. చేనేత వస్త్ర ప్రదర్శన శుక్రవారం స్థానిక మెసానిక్ టెంపుల్ లో ప్రారంభమైంది. రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్, ఎంఎల్‌సి డాక్టర్ సురేష్ బాబు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తదితరులు చేనేత ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈనెల 17వరకు సెలవు రోజుల్లో కూడా ప్రదర్శన ఉంటుందని చేనేత జౌళి శాఖ అధికారి మురళీ కృష్ణ తెలిపారు. సుమారు 60లక్షల వరకు విక్రయాలు జరగవచ్చని అంచనా వేస్తున్నామని, మన్నిక గల వస్త్రాలు , మగ్గం ధరలకే విక్రయిస్తామని తెలిపారు.

చేనేత కార్మికులను అన్ని విధాలా ప్రోత్సాహం

అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ చేనేత కార్మికులలో ఉత్సాహాన్ని నింపి, వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతామనిఅన్నారు. మిల్లులతో పోటీ పడి నాణ్యతలో, మన్నికలో రాజీ పడకుండా నేతన్నలు తయారు చేసిన వస్త్రాలకు డిమాండ్ అధికంగా ఉందని, కొనుగోలు కూడా బాగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేసారు. చేనేతను జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం 50 ఏళ్ళ నిండగానే పింఛను కూడా అందిస్తోందన్నారు. నేతన్న నేస్తం కింద మగ్గాలు, నూలు, సామాగ్రిని కొనుగోలు చేసుకోడానికి సహకరిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అన్ని విధాలా నేతన్నలకు ధైర్యాన్ని కలిగిస్తోందని తెలిపారు.

ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత ప్రదర్శనలు నిర్వహిస్తూ నేతన్నలను ప్రోత్సహిస్తోందన్నారు.

21న జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు

- విద్యుత్తు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించండి : కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- గ్రామకంఠాల సర్వే కీలకం : జెసి అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

డిసెంబరు 21న సామూహిక గృహప్రవేశాలకు జగనన్న కాలనీలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 50శాతం ఇళ్లు పూర్తయిన కాలనీలకు వెంటనే తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. గృహ నిర్మాణ ప్రగతి తక్కువగా ఉన్న మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పరిస్థితి మెరుగుపడాలని ఆదేశించారు. జగనన్న గృహ నిర్మాణం, సచివాలయాలు, ఆర్‌బికె, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం, జలజీవన్ మిషన్, స్పందన గ్రీవెన్స్, స్వామిత్ర, రీసర్వే, కన్వర్జెన్సీ పనులు మొదలగు అంశాలపై కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలో ప్రగతి కొన్ని మండలాల్లో తక్కువగా ఉండటానికి కారణాలను ఆరా తీశారు. వర్షాల కారణంగా పనులు ఆపేసిన చోట, వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. ఇసుక సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, ఆర్చ్‌లను నిర్మించాలని సూచించారు. పండగ వాతావరణంలో గృహ ప్రవేశాలు జరిగేటట్టుగా కాలనీలను తీర్చిదిద్దాలని నిర్దేశించారు. ఒకసారి ఇళ్లు రద్దు అయితే, మళ్లీ అంత త్వరగా ఇళ్లు మంజూరయ్యే అవకాశం లేదని స్పష్టం చేశారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, అత్యంత కీలకమైన గ్రామ కంఠాల సర్వే త్వరలో మొదలు కాబోతోందని చెప్పారు. గ్రామ కంఠాల సర్వే నిర్వహించడం దేశంలోనే ఇదే తొలిసారని అని అన్నారు. ఈ సర్వే జరిగేటప్పుడు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సర్పంచ్, ఎంపిటిసి, వార్డు సభ్యులు తదితర స్థానిక ప్రజాప్రతినిధుల సహకారాన్ని కూడా తీసుకోవాలన్నారు. గ్రామ సభ నిర్వహించి వివరాలను ఖరారు చేయాలని అన్నారు. మొత్తం 42 రకాల వివరాలతో కూడిన ప్రొఫార్మాను పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. అత్యంత ఖచ్చితమైన వివరాలతో, పారదర్శకంగా భూహక్కు పత్రాలను రూపొందించాల్సి ఉంటుందని అన్నారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వి రమణమూర్తి, సిపిఒ పి.బాలాజీ, వివిధ శాఖల అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనైతిక చర్యలు మానుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అనైతిక చర్యలు మానుకోవాలని పట్టణ టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీపేరు మార్పును నిరసిస్తూ కొద్ది రోజుల క్రితం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద టిడిపి నాయకులు సంతకాలు సేకరించారు. ఆసంతకాలతో కూడిన ఫ్లెక్సీని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సూర్య కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పేర్లు మార్చే సంస్కృతికి తెరలేపిందని అన్నారు. రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశాలు పేర్లు , మహోన్నత వ్యక్తుల పేర్లు తో ఉన్న ప్రదేశాలు, కట్టడాల పేర్లు మార్చే ప్రయత్నం ఇప్పటివరకూ ఎవరూ చేయలేదన్నారు. కానీ వైసిపిప్రభుత్వం పేర్లు మార్చే సంస్కృతిని తీసుకొచ్చిందన్నారు. హెల్త్ యూనివర్సిటీ పేరును మార్చడాన్ని ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, బొద్దల నర్సింగరావు, కనకల లక్ష్మి, వరప్రసాద్, కంది మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి : సిపిఎం


ప్రజాశక్తి-బొబ్బిలి

సాలూరు, మన్యం జిల్లా పోలీసులు ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు డిమాండ్ చేశారు. పోలీసులు పెట్టిన తప్పుడు కేసులతో గతనెల 27 నుంచి జైల్లో ఉండి బెయిల్‌పై శుక్రవారం బొబ్బిలి సబ్ జైలు నుంచి విడుదలైన వై.మన్మథరావు, మర్రి శ్రీనివాసరావు లకు సిపిఎం నాయకులు స్వాగతం పలికారు. అక్రమ అరెస్టులు, కేసులతో ఉద్యమాలను ఆపలేరని ఈ సందర్భంగా రెడ్డివేణు అన్నారు.

స్వాగతం పలికిన వారిలో పొట్నూరు శంకర్రావు, మన్యం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, వి.ఇందిర, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.గోపాలం, రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు వాసు, ఎ.సురేష్ ఉన్నారు.



సబ్‌జైలు నుంచి విడుదలైన సిపిఎం జిల్లా నాయకులు మన్మథరావు, శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు



టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఖాదర్ బాషా

మైనారిటీల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా తెలిపారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయన శుక్రవారం కేంద్ర మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెం నాయుడుకు పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాషా మాట్లడుతూ ఇంత చిన్న వయసులో తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించి నందుకు పార్టీ అధినేత చంద్రబాబుకు, మాజీ మంత్రి నారా లోకేష్‌కు, అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భాషా మాట్లాడుతూ రానున్న రోజుల్లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మైనారిటీలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు : ఎపిసి

ప్రజాశక్తి-విజయనగరం

డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు కొద్దిరోజులుగా జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని, దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సమగ్ర శిక్ష ఎపిసి వి.స్వామినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి కొంతమంది వ్యక్తులు, జెడ్‌పి ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సమగ్రశిక్షా డిపార్టుమెంటు నుంచి ఎటువంటి డిజిటల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో డైలీ వేస్ పద్దతిలో గాని, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గాని, కాంట్రాక్టు పద్ధతిలో గాని భర్తీ చేసేందుకు ఎటువంటి నోటిఫికేషన్ విడుదల చేయలేదని పేర్కొన్నారు. కావున నిరుద్యోగులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని తెలిపారు.

14 నుంచి ఎస్‌సి సంక్షేమ కమిటీ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ పర్యటన ఈనెల 14 నుండి 16 వరకు జరుగుతుందనిజిల్లా కలెక్టర్ సూర్య కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 14న రాత్రి 9 గంటలకు విజయనగరం చేరుకొని రాత్రి బస చేస్తారని తెలిపారు. 15న ఉదయం 10 గంటలకు అన్ని శాఖలకు చెందిన రోస్టర్ రిజిస్టర్లను పరిశీలిస్తారు. 16న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో కలిసి జిల్లా అధికారులతో రూల్ ఆఫ్ రిజర్వేషన్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తారని తెలిపారు. సాయంత్రం 7.30గంటలకు బయలు దేరి విజయవాడ వెళ్తారని తెలిపారు.

పేదల ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు

ఎమ్మెల్సీ సురేష్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఫుడ్ బ్యాంకుల ద్వారా పేదవారి ఆకలి తీర్చే ప్రక్రియ అభినందనీయమని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. విశాఖకు చెందిన డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ రాజా రమేష్ దంపతులు సమకూర్చిన ఆహారాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఫుడ్ బ్యాంక్ ద్వారా పేదలకు అందజేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మేయర్ విజయలక్ష్మి పేదలకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్‌పి చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలో నాలుగు చోట్ల ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి తద్వారా అన్నార్తులకు ఆహారాన్ని అందించడం ఆదర్శప్రాయ మన్నారు. జన్మదినాలు, ఇతర శుభకార్యాలలో పేదలకు ఆహారాన్ని అందించడం ద్వారా ఆకలి తీర్చే వారమవుతామన్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఫుడ్ బ్యాంకుల ఔన్నత్యాన్ని పెంచే విధంగా సహకరించాలని కోరారు. అనంతరం వైసిపి నాయకుడు బాలి యోగి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలి పైడ్రాజు, బాలి ప్రతాప్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

విద్యలో ఫలిస్తున్న ప్రభుత్వ కృషి

మాజీ ఎమ్‌పి డివిజి శంకరరావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్రాల్లో పాఠశాల విద్యా ప్రమాణాల్ని ఏటేటా కేంద్రం పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ద్వారా మదింపు వేస్తుంది. ఫలితాలు, నిర్వహణ తదితర అంశాల్లో 70 సూచీలను ఆధారం చేసుకుని ఇచ్చే ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండడం అభినందనీయమని మాజీ ఎమ్‌పి డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సూచీల్లో వచ్చే పాయింట్ల ఆధారంగా లెవెల్ 2 పొందిన ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా నిలవడం గర్వకారణమన్నారు. 2019కి ముందు లెవెల్-6లో ఉన్న రాష్ట్రం గుజరాత్, కేరళ, మహారాష్ట్రతో సమానంగా ముందు వరుసలోకి రావడం ప్రభుత్వం చేస్తున్న కృషికి తగ్గ ఫలితం కనిపిస్తుందని పేర్కొన్నారు. అంతే కాకుండా పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి, సౌకర్యాలు కల్పించడానికి, బోధనలో నాణ్యతను మెరుగుపర్చడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగాయన్నారు. గతంలో 37 లక్షల మంది పిల్లలు నమోదైతే, ఇప్పుడా సంఖ్య 42 లక్షలకు చేరుకుందన్నారు. విద్యాకానుక, అమ్మఒడి, డిజిటల్ క్లాస్ రూమ్‌ల అందుబాటు, 3వ తరగతి నుండి సబ్జెక్టు టీచర్ల బోధన తదితర విప్లవాత్మక చర్యలతో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్య అత్యుత్తమమైన సామాజిక పెట్టుబడని, దానిపైన పెట్టే ఖర్చు వృథా పోదని తెలిపారు. తిరిగి విలువైన మానవ వనరులు అందించడం ద్వారా రెట్టింపు రాబడి అందిస్తుందన్నారు.

పింఛన్ల పెంపు ప్రతిపాదన తిరస్కరణ దారుణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగుల పింఛన్ల పెంపుదల ప్రతిపాదన తిరస్కరించడం దారుణమని రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగుల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పిఎఫ్ కనీస పింఛను రూ.10 వేలు పెంచాలని కార్మిక శాఖ పంపించిన ప్రతిపాదనలు కేంద్ర ఆర్థికశాఖ తిరస్కరించడం దారుణమన్నారు. ఐదేళ్లపాటు ఎమ్మెల్యే, ఎమ్‌పిలుగా పనిచేస్తున్న వారు వేలకు వేలు ప్రయోజనాలు పొందుతున్నారు గాని ఇపిఎఫ్ చందాదారులకు పింఛన్లు పెంచకపోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నడిపేన రామ్మూర్తి, వెంకటప్పడు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లిలో మరుగుదొడ్ల నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ శుక్రవారం శంకుస్థాపనచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమైన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించకుంటే, రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. నూటికి నూరుమందికి మరుగుదొడ్లు ఉండాల్సిందేనని, పరిసరాల పరిశుభ్రతే మన తొలి ప్రాధాన్యం కావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు గొలగాని రమాదేవి, చెలికాని మురళీకృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు తెర్లి సత్యారావు పాల్గొన్నారు.

గ్రామసభలో 27 పనులకు ఆమోదం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని పెద్దపుర్లి పంచాయతీలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీలో గుర్తించిన 27 పనులకు ఆమోదించినట్లు ఎపిఒ ఎస్.హరినాథ్ తెలిపారు. శుక్రవారం పెద్దపుర్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ వై.రామినాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఆమోదం పొందిన పనులకు తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్లు, కల్వర్టులు, శ్మశాన వాటికల నిర్మాణాలు, చెరువుల పునరుద్ధరణ తదితర రకాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, టెక్నికల్ అసిస్టెంట్లు త్రినాథ్, ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బాలమురళి పాల్గొన్నారు.



వాటర్ కూలర్‌ను అందజేస్తున్న కృష్ణమాచార్యులు దంపతులు

వెంకటేశ్వర ఆస్పత్రికి వాటర్ కూలర్ వితరణ

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలో పిఎంఎల్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వర ఆస్పత్రికి దేవాడకు చెందిన విశ్రాంత జిల్లా మలేరియా నివారణ అధికారి కె.ఎ.కృష్ణమాచార్యులు, ఆండాళ్ దంపతులు వాటర్ కూలర్ అందించారు. ఈ వాటర్ కూలర్‌ను శుక్రవారం ఆస్పత్రి వైద్యులు రాజు సమక్షంలో ప్రారంభించారు. దాతలకు డాక్టర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

పరుగు పోటీల్లో రాణిస్తున్న బొబ్బిలి యువకుడు గణేష్‌ను శుక్రవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సన్మానించారు. అన్ని రంగాల్లో బొబ్బిలి యువకులు ముందుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి సత్యవంతుడు

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెఆర్‌పేట పంచాయతీ పరిధిలో రోడ్డు పనులకు శుక్రవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్తు నిధులు సుమారు మూడు లక్షలతో పిలకానబంద నుంచి కొనాం గట్టు వరకు రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్.బాలబాబు, మాజీ సర్పంచ్ ఎ.పైడిబాబు, వైస్ సర్పంచ్ మురుకుర్తి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ కిల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

కెఆర్‌పేట ప్రాథమిక పాఠశాలను ఎంపిపి సత్యవంతుడు పరిశీలించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు పట్టికను, విద్యార్థులకు ఇస్తున్న మెనూ రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు

సంతలోకి పశువులు తీసుకురావద్దు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

లంపిస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందుతుండడంతో సంతల్లోకి పశువులను తీసుకురావద్దని రైతులకు, వ్యాపారులుకు ఇఒపిఆర్‌డి డి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అల్లాడపాలెం సంతలో మోనిటరింగ్ కమిటీతో ఆయన సమావేశమయ్యారు. లంపిస్కిన్ వ్యాధిపై సంతలో వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించారు. దాంతోపాటు సంతలో పాలిథీన్ నిషేధంపై అవగాహన కల్పించారు. సమావేశంలో రెవెన్యూ, ఎఎంసి, పోలీస్ అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశాలు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పెదతాడివాడలో పిబిఆర్ కల్యాణ మండపంలో శనివారం వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, నియోజకవర్గ స్థాయి నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు హాజరుకావాలని కోరారు.

వేపాడ : లక్కవరపుకోటలోని శ్రావణి కళ్యాణ మండపంలో శనివారం వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు తెలిపారు. వేపాడ మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

జమ్ము పాఠశాలకు పురస్కారం.. జిల్లాకే గర్వకారణం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జమ్ము ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛ విద్యాలయ జాతీయ పురస్కారం లభించడం జిల్లాకే గర్వకారణమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఏకైక పాఠశాలగా జమ్ము పాఠశాల జాతీయ అవార్డుకు ఎంపికయ్యింది. శుక్రవారం ఆయన జమ్ము పాఠశాలను సందర్శించారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. పాఠశాలకు అవసరమైన వసతులు గురించి ఆరా తీశారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే జమ్ములో పాఠశాల ఏర్పాటు అయిందన్నారు. నాటి నుండి అభివృద్ధి చెందుతూ నేడు జాతీయస్థాయి అవార్డు పొందడం విశేషం అన్నారు. పాఠశాల అదనపు భవన నిర్మాణానికి, ప్రహరీ గోడ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పాఠశాలలకు జాతీయస్థాయి గుర్తింపు రావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి ప్రైవేటుకు దీటుగా సర్కార్ పాఠశాలలను ఆదర్శంగా నిలుపుతున్నారన్నారు. హయగ్రీవ పాఠశాల శిథిలావస్థకు చేరడంతో తన సొంత నిధులతో పాఠశాలను నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన లైట్లు, ఫ్యాన్లు, ఇతర సామాగ్రి అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, ఎఎంసి చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, డిఇఒ వెంకటేశ్వరరావు, ఎంఇఒ రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి

సంక్షేమ పథకాలతో నేరుగా లబ్ధి

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

సంక్షేమ పథకాలతో ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. బాడంగి మండలం గజరాయనివలస గ్రామానికి చెందిన సుమారు 12 కుటుంబాలు మాజీ సర్పంచ్ మూడడ్ల సత్యనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం టిడిపిని వీడిని శంబంగి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి బొబ్బిలి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మూడడ్ల భాస్కరరావు, పూడి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని జొన్నాడ పంచాయతీలో అభివృద్ధి పనులకు సర్పంచ్ కోరాడ రమణి కోటినాయుడు శ్రీకారం చుట్టారు. ఇటీవల ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది. ఈ నిధుల్లో సుమారు రూ.10 లక్షలు కేటాయించి, గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.4.35 లక్షలతో సిసి కాలువ, ఒసి కాలనీలో రూ.3.5 లక్షలతో సిసి రోడ్డు, కాలువ, ఎస్‌సి కాలనీలో రూ.2.5 లక్షలతో కల్వర్టు శ్లాబ్ నిర్మిస్తున్నారు. మండలంలో సచివాలయాలకు కేటాయించిన నిధులతో తొలుత జొన్నాడ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడం గమనార్హం. మిగతా సచివాలయాల్లోనూ అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి సూచించారు.



జొన్నాడలో నిర్మిస్తున్న కాలువ

మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-బొండపల్లి

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి దీపిక పాటిల్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్‌పి తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గుర్తించామ న్నారు. అలాంటి పరిధుల్లో నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎక్కువగా మద్యం సేవించి వాహనాలు నడపడంతో పాటు మైనర్లు డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపైనా ప్రత్యేక నిఘా పెడతామని తెలిపారు. స్టేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు చేసి, పెండింగ్ కేసులు లేకుండా చూడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి మోహనరావు, సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ రవి, తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్‌పి దీపిక

హత్యా రాజకీయాలు దుర్మార్గం

జనసేన ఆధ్వర్యాన నిరసన



బొబ్బిలిలో అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి హత్యా రాజకీయాలు చేయడం దుర్మార్గమని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. హత్యా రాజకీయాలకు నిరసనగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ బొమ్మ వద్ద జనసేన ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనకు ప్రజల నుంచి ఆదరణ పెరగడంతో వైసిపి ఓర్వలేకనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను హత్య చేసేందుకు ఆయన ఇంటి వద్ద రెక్కీ నిర్వంచిందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌ను చంపేస్తామని వైసిపి నాయకులు బహిరంగంగా ప్రకటించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు పవన్ కల్యాణ్‌కు భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. రెక్కీ వెనుక ఎవరి హస్తం ఉందో దర్యాప్తు చేసి బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.


విజయనగరం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇంటివద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు ఉండటాన్ని నిరసిస్తూ పవన్ కళ్యాణ్ కు ప్రత్యేకమైన భద్రతను కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ కూడలిలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఆదాడ మోహనరావు,జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు (బాలు) మాట్లాడారు. పవన్ కళ్యాణ్ కు పెరుగుతున్న ప్రజాదరణ చూడలేకే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇటువంటి నీచమైన, దిగజారుడు రాజకీయాలకు తెరలేపిందని అన్నారు. పవన్ కళ్యాణ్ కు బుల్లెట్ ప్రూఫ్ వాహనం, జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు. రామకృష్ణారావు మాట్లాడుతూ బిసి నాయకులను అణగదొక్కాలని కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. దీక్షలో లోపింటి కళ్యాణ్, పొట్నూరు చందు, కందివలస సురేష్, కలిశెట్టి రామకృష్ణ, తుమ్మి లక్ష్మీరాజ్, గంట్లాన పుష్పకుమారి, తుమ్మి అప్పలరాజు దొర తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : పవన్ కళ్యాణ్‌కు భద్రత కల్పించాలని జనసేన ఆధ్వర్యాన చీపురుపల్లి పట్టణంలోని గాంధీ సెంటర్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టి.సూర్యనారాయణ, వి.శ్రీనివాసరావు, అడ్డాల రామచంద్రరావు, డి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

సెంచూరియన్‌కు ఎన్‌సిసి యూనిట్!

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటు చేయడానికి అనువైన వాతావరణం ఉందని కల్నల్ మండల్ తెలిపారు. శుక్రవారం కల్నల్ మండల్ ఆధ్వర్యంలో ఆర్మీ అధికారుల బృందం యూనివర్సిటీని సందర్శించింది. ఇక్కడ ఎన్‌సిసి- బి, సి సర్టిఫికెట్ విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు అనువైన వాతావరణం ఉందా? లేదా? అనే విషయాన్ని పరిలించారు. ఈ సందర్భంగా విసి జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏయే కోర్సులు నిర్వహిస్తున్నదీ వివరించారు. నైపుణ్య శిక్షణలో సెంచూరియన్ ముందంజలో ఉందన్నారు. ఎన్‌సిసి విద్యార్థులకు సాధారణ శిక్షణతోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్, గుర్రపు స్వారీ తదితర శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. దానికి కల్నల్ మండల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ ను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ బంగారమ్మ

నిజాయితీకి సత్కారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇటీవల సాలూరు డిపో బస్సు డ్రైవర్ ఎస్.ఎ.రావు ప్రయాణికుడు మరచిపోయిన రూ.2 లక్షలు విలువైన ఆభరణాలను తిరిగిన వారికి అప్పగించిన విషయం తెలిసిందే. నిజాయితీగా వ్యవహరించిన డ్రైవర్ ఎస్.ఎ.రావును శుక్రవారం కొండవెలగాడలో ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ సత్కరించి, ప్రశంసాపత్రం అందజేశారు. కొత్తగా బదిలీపై వచ్చిన సాలూరు డిపో మేనేజర్ ఎ.భాస్కర్‌రెడ్డి.. చైర్‌పర్సన్ బంగారమ్మను మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో అకౌంట్ అధికారి బి.రాంబాబు, గ్రామ నాయకులు అక్కోజి, నర్సయ్య, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొండగంగుపూడిలో ఫ్యామిలీ డాక్టర్


ప్రజాశక్తి-వేపాడ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కొండగంగుపూడిలో శుక్రవారం వైద్యాధికారి రమాదేవి వైద్యసేవలు అందించారు. 60 మందికి పరీక్షలు చేసి, ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి కిరణ్, ఎంఎల్‌పి సత్య, ఎఎన్ఎం అప్పయ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాల్సిందే

ప్రజాశక్తి-వేపాడ

క్లాప్‌మిత్రులకు వేతనాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు గుదిబండగా మారాయని, వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని శుక్రవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్‌కు మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుద్యోగ వెంకటరమణ ఆధ్వర్యాన వినతి అందించారు. క్లాప్‌మిత్రులకు గ్రామ పంచాయతీల నుంచి ఆర్నెల్ల వేతనాలు చెల్లించాలని ఆదేశించారని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, బిల్లు బకాయిలు, ఇతర సమస్యలతో పంచాయతీలు సతమతమవుతుంటే, పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు సర్పంచులకు గుదిబండగా మారాయని చెప్పారు. వెంటనే ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న సర్పంచులు



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఐక్య పోరాటంతో హక్కులు సాధ్యం

ప్రజాశక్తి- మెంటాడ

ఐక్య పోరాటంతోనే హక్కులు సాధించుకోవచ్చని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి తెలిపారు. శుక్రవారం మెంటాడలో సిఐటియు మండల మహాసభ సన్యాసమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో లక్ష్మి, జెవివి నాయకులు జి.అప్పలనాయుడు మాట్లాడారు. కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. గ్రీన్ అంబాసిడర్లకు తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలన్నారు. అనంతరం సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఏల సన్యాసమ్మ, కోకన్వీనర్‌గా పొట్నూరు వరలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘ జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, అంగన్వాడీ కార్యకర్తలు బి.కొండమ్మ, సిహెచ్ ఈశ్వరమ్మ, గ్రీన్ అంబాసిడర్లు అలమండ సన్యాసిరావు, దేవుడు, ఆర్.సింహాచలం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పినతాడివాడలో అన్నదానం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడ గ్రామంలో సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఆధ్వర్యాన శుక్రవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 18 సార్లు స్వామి మాల ధరించిన సందర్భంగా ఆయన ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2 వేల మంది హాజరయ్యారు. శుక్రవారం రాత్రి సుమారు వెయ్యి మంది స్వామి భక్తులతో అంబలం పూజ ఏర్పాటుచేశారు.

లక్ష్మింపేట సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-వంగర



నారాయణరావు(ఫైల్)

మండలం లోని లక్ష్మింపేట గ్రామానికి చెందిన సర్పంచ్ వాన నారాయణరావు (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య నారాయణమ్మ, కుమారులు జగదీష్, కిరణ్ ఉన్నారు. సర్పంచ్ నారాయణరావు మృతి పట్ల ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, నాయకులు కరణం సుదర్శనరావు, సర్పంచులు, ఎంపిటిసిలు సంతాపం తెలిపారు. ఆ గ్రామానికి వెళ్లి నారాయణరావు కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు.

నాటు తుపాకీతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-వేపాడ

అనుమతులు లేకుండా నాటు తుపాకీ కలిగి ఉన్న వ్యక్తిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అరిగిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కొండగుళ్ల ప్రాంతంలో సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి, కొత్తవలస కోర్టుకు తరలించినట్లు సిఐ సింహాద్రి నాయుడు వెల్లడించారు. శ్రీనివాసరావును రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



విరగ్గొట్టిన వాష్‌బేసిన్‌ను పరిశీలిస్తున్న ఎంఇఒ ప్రసాదరావు

పాఠశాలలో సామగ్రి ధ్వంసం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని అంబఖండి ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్లలో వాష్‌బేసిన్లు, తలుపులను, ఎల్ఇడి దీపాలు, ట్యాపులను దుండగులు ధ్వంసం చేశారు. వీటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ప్రధానోపాధ్యాయులు మోహన్ రావు తలుపులు తీసేసరికి ధ్వంసమై ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఎంఇఒ ఎం.వరప్రసాద్‌రావు, సర్పంచ్ లక్ష్మీ గోవింద్‌కు తెలిపారు. ఎంఇఒ పరిశీలించి, పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు తెలిపారు.

టిబి ఆస్పత్రిలో సోలార్ బ్యాటరీలు చోరీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా క్షయ నివారణ ఆస్పత్రిలో ఆరు రోజుల క్రితం దొంగలు సోలారు విద్యుత్ బ్యాటరీలను ఎత్తుకుపోయారు. వీటి విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని అంచనా. ఈనేపథ్యంలో క్షయ నివారణ అధికారి రామేశ్వరపు ప్రభు ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొద్ది రోజులుగా ఆస్పత్రిలో పరిస్థితి అధ్వానంగా మారింది. ఆస్పత్రి నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలోనే బ్యాటరీలు చోరీకి గురయ్యాయని తెలిసింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి దొంగలను పట్టుకోవాలని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కమిటీ సభ్యులు కోరుతున్నారు.